## రాష్ట్ర ప్రజలకు గవర్నర్ సంక్రాంతి శుభాకాంక్షలు



హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రజలకు భోగి, సంక్రాంతి పర్వదినాల సందర్భంగా ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. పాడిపంటలు, సుఖ శాంతులతో ప్రజలు తులతూగాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కాంక్షించారు. పండుగలు మన వారసత్వ ప్రతీకలని పేర్కొన్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు అత్యంత విలువ ఇచ్చే రాష్ట్ర ప్రజలు నిత్యం సుఖశాంతులతో విలసిల్లాలని ఆయన అభిలషించారు.

### సిరిసంపదలతో తులతూగాలి: ఎంపీ వద్దిరాజు



సంక్రాంతి పండుగ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇల్లు సిరి సంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. బంధుమిత్రులతో కలిసి సంక్రాంతి సంబురాలను ప్రశాంతంగా జరుపుకోవాలని తెలిపారు.

## మూడు రోజుల్లో ఏపీ వైపు 1.78లక్షల వాహనాలు

- హైదరాబాద్ -విజయవాడ రహదారిపై వాహనాల రద్దీ

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి పండుగ నేపథ్యంలో పట్టణ వాసులందరూ పల్లెబా ట పట్టారు. దీంతో హైదరాబాద్ నుం చి విజయవాడ, కర్నూలు, తమిళనా డు వెళ్లే దారులన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. ప్రధానంగా హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగుతున్నది. చౌటుప్పల్, తుప్రాన్‌పేట, ఆందోల్ మైసమ్మ, పంతంగి టోల్ ప్లాజా తదిత ర ప్రాంతాల వద్ద పోలీసులు ట్రాఫిక్ ను క్రమబద్ధీకరిస్తున్నారు. మూడు రో జుల్లో 11టోల్ గేట్ల ద్వారా ఏపీ వైపు సుమారు 1,78,000 వాహనాలు వెళ్లాయి.

# అమ్మకానికి మదర్ డెయిరీ ఆస్తులు!

➤ మొదటిపేజీ తరువాయి...

యూనియన్ లిమిటెడ్ (మదర్ డెయిరీ) మూడున్నర దశాబ్దాల కాలంగా పాడి ఉత్పత్తిదారులకు ఆసరాగా నిలుస్తున్నది. ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 24 చిల్లింగ్ సెంటర్లు, 32 వేల మంది సభ్యులు, 432 సొసైటీల ద్వారా రోజుకు లక్ష లీటర్ల పాల సేకరణ జరుగుతున్నది. 3లక్షల మంది వినియోగదారులకు పాలు, పాల ఆధారిత ఉత్పత్తులను అందిస్తున్నది.

**రూ.60కోట్ల అప్పులు అంటూ..**

మదర్ డెయిరీ 26వ సర్వసభ్య ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు ఈ నెల 9న సభ్యులకు నోటీసులు జారీ చేశారు. ఫిబ్రవరి 2న హయత్ నగర్‌లో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. 'నార్మాక్ యూనియన్ రూ.60కోట్ల వరకు ఆర్థిక భారం ఏర్పడి రోజువారీ కార్యక్రమాలు నిర్వహించేందుకు యూనియన్ స్థిరాస్తులు విక్రయించడానికి చర్చించి నిర్ణయం తీసుకుకోవడానికి..' అని ఎజెండాలో స్పష్టం చేశారు.




**ఉమ్మడి నల్లగొండలో 30.5 ఎకరాల అమ్మకం**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యూనియన్ పేరు మీద కొనుగోలు చేసిన భూములను అమ్మాలని స్కెచ్ వేశారు. నల్లగొండ జిల్లాలోని చిట్యాల పరిధిలో 29 ఎకరాలు, మిర్యాలగూడ పరిధిలోని 1.5 ఎకరాల భూమిని విక్రయించాలని ఎజెండాలో పేర్కొన్నారు.

**గతంలో ఒప్పుకోని బీఆర్‌ఎస్ సర్కారు**

పాడి రైతులకు వరంగా ఉన్న డెయిరీ ఆస్తులను అమ్మేందుకు నాడు కేసీఆర్ ప్రభుత్వం ససేమిరా అంది. గతేడాది సెప్టెంబర్‌లో మదర్ డెయిరీ ఎన్నికల సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు క్యాంపులకు విజయ డెయిరీ మాదిరిగానే మదర్ డెయిరీకి గ్రాంట్లు ఇప్పించి, అప్పులు తీర్చేలా ఆదుకుంటామని ప్రకటించారని సభ్యులు చెబుతున్నారు. లీటరుకు రూ.4 బోనస్ ఇస్తామని చెప్పి పాల రేట్లను తగ్గిస్తూ వచ్చారని వాపోతున్నారు.

**ఆస్తులు విక్రయిస్తే ఉద్యమమే..**



మదర్ డెయిరీ ఆస్తులు అమ్మడానికే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందా? ఎన్నికల సమయంలో మంత్రి కోమటిరెడ్డి, విప్ బీర్ల ఐలయ్య చెప్పిన గ్రాంట్లు ఏమయ్యాయి..? లీటరుపై నాలుగు రూపాయల బోనస్ ఇవ్వకపోగా రేట్లు తగ్గించడం దారుణం. ఆస్తుల విక్రయం నిర్ణయాన్ని విరమించుకోవాలి. పట్టించుకోకుండా ముందుకు వెళ్తే పెద్దఎత్తున ఉద్యమం చేస్తాం.

**- దొంతిరి సోమిరెడ్డి, మదర్ డెయిరీ మాజీ డైరెక్టర్**

## రిటైర్మెంట్ సడలింపుపై వీసీల గుర్రు

- రెగ్యులర్ వారికి ఒకలా.. కాంట్రాక్ట్ వారికి మరోలా!
- 60 ఏండ్లు దాటిన కాంట్రాక్ట్ బోధకుల కొనసాగింపు
- రెగ్యులర్ ప్రొఫెసర్లకూ అరవై ఏండ్లకే పదవీ విరమణ
- ఉన్నత విద్యామండలి తీరును వ్యతిరేకిస్తున్న వీసీలు

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ నిబంధనలంటే అందరికి సమానం. ఇక రిటైర్మెంట్ విషయంలో ఎవరికీ మినహాయింపేం కాదు. కానీ ఉన్నత విద్యామండలి మాత్రం ఈ విషయాన్ని విస్మరించి నడుచుకుంటున్నది. రెగ్యులర్ వారికి ఒకలా.. కాంట్రాక్ట్ వారికి మరోలా నిబంధనలను అమలుచేయడానికి ప్రయత్నిస్తున్నది. ఒకవైపు రెగ్యులర్ ప్రొఫెసర్లు 60 ఏండ్లకే పదవీ విరమణ పొందుతుండగా, 60 ఏండ్లు దాటిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను తిరిగి కొనసాగించవచ్చని ఆదేశాలిచ్చింది. వర్సిటీలకు మండలి లేఖలు రాసింది. ఇది వివాదాస్పదమైంది. ఈ లేఖపై ఉన్నత విద్యా మండలి వర్సెస్ వర్సిటీలు అన్నట్టుగా పరిస్థితి తయారైంది. ఇటీవల ఉన్నత మండలి అన్ని వర్సిటీల వీసీలతో నిర్వహించిన సమావేశంలో లేఖ ప్రస్తావన రాగా, ఓయూ, మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్ వర్సిటీల వైస్ చాన్స్‌లర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదేం విధానమని, ఎలా కుదురుతుందని మండలి అధికారులను నిలదీసినట్టు తెలిసింది. అటానమస్ హోదా గల వర్సిటీల విషయంలో మండలి జోక్యం తగదని కొందరు వీసీలు అన్నట్టుగా ప్రచారం జరుగుతున్నది. మండలి కేవలం సూచనలు, సలహాలు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందని చెప్పినట్టుగా అధికారుల్లో చర్చలు నడుస్తున్నాయి.



**అవసరముంటేనే తీసుకోవాలని సూచించాం**

వర్సిటీల్లో అవసరముంటే 60 ఏండ్లు దాటిన వారిని తీసుకోవాలని సూచన మాత్రమే చేశాం. అవసరాన్ని బట్టి పరిశీలించమన్నాం. అదేం జీవో కాదు. కేవలం సర్క్యులర్ మాత్రమే. అయినా కొనసాగించాలా.. లేదా అన్నది వీసీల ఇష్టం. తప్పనిసరిగా అమలుచేయాలన్న నింబంధనలేం లేవు.

**- ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి**

## 'సంక్రాంతి' లింక్ క్లిక్‌చేస్తే లూటీ

- ప్రమాదకర మాల్‌వేర్‌తో సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తుగడ
- జాగ్రత్తలు పాటించాలంటున్న సైబర్ సెక్యూరిటీ బ్యూరో

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): 'ఎంజాయ్ సంక్రాంతి స్పెషల్ ఫ్రీ రీచార్జ్.. 4 జీబీ డాటా వ్యాలిడ్ టిల్ యువర్ కరెంట్ ప్యాక్ వ్యాలిడిటీ. ఆల్సో గెట్ 2 జీబీ డాటా ఆన్ యువర్ నెక్ట్స్ రీచార్జ్' అంటూ ఓ సైబర్ మోసగాడి నుంచి ఫేక్ మెసేజ్. 'సంక్రాంతి పండుగ సందర్భంగా మీ నంబర్‌కు బంపర్ ఆఫర్ వచ్చింది. మీకు 10 జీబీ డాటా ఉచితంగా అందించబడుతుంది. దీని కోసం మేము పంపిన లింక్‌ను క్లిక్ చేసి, మీ వివరాలు పొందుపర్చండి. ఆ తర్వాత ఆ మెసేజ్‌ను 10 మందికి పంపితే మీకు పూర్తి ఉచితంగా 10 జీబీ డాటా లభిస్తుంది' అంటూ మరో కేటుగాడి మెసేజ్. ఇలా.. సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియాలో ప్రకటనలు, మెసేజ్‌లతో అమాయకులకు వల వేసి డబ్బులు లూటీ చేస్తున్నారు. దీనిపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో అప్రమత్తమైంది.ఇలాంటి ప్రకటనలకు ఎవరూ ఆశపడొద్దని, లింకులను క్లిక్ చెయ్యొద్దని సూచిస్తున్నది.

## నా కుమారుడికి గుర్తింపు ఇవ్వలేదు

**ఓపెన్ ఏఐపై సుచిర్ బాలాజీ తల్లి ఆరోపణ • మరణంపై ఎఫ్‌బీఐ విచారణకు డిమాండ్**

న్యూఢిల్లీ, జనవరి 12: చాట్‌జీపీటీ అభివృద్ధిలో తన కుమారుడు ఎంతో కృషి చేసినప్పటికీ ఓపెన్‌ఏఐ సంస్థ మాత్రం తగిన గుర్తింపు ఇవ్వలేదని సుచిర్ బాలాజీ తల్లి అపర్ణారావు ఆరోపించారు. చాట్‌జీపీటీని అభివృద్ధి చేసిన ఓపెన్‌ఏఐలో సుచిర్ బాలాజీ నాలుగేండ్లు పని చేసి 2023 ఆగస్టులో రాజీనామా చేశారు. ఆ తర్వాత ఓపెన్‌ఏఐ అనైతిక చర్యలకు పాల్పడుతున్నదని ఆయన ఆరోపించి, పలు ఆధారాలను బయటపెట్టారు. ఈ క్రమంలో గత నవంబర్‌లో శాన్ ఫ్రాన్సిస్కోలోని తన అపార్ట్‌మెంట్‌లో సుచిర్ బాలాజీ అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఈ విషయమై ఆయన తల్లి అపర్ణారావు మారియా నాఫల్ అనే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌తో మాట్లాడుతూ..'చాట్‌జీపీటీని వేగంగా, సమర్థంగా అభివృద్ధి చేయడానికి నా కొడుకు తోడ్పడ్డాడు. కానీ తను మరణించే వరకు తన పనికి గుర్తింపు దక్కలేదనే బాధ అతడిలో ఉండేది. ఇప్పుడు కూడా సుచిర్ సేవలకు ఓపెన్‌ఏఐ తగిన గుర్తింపు ఇవ్వకపోవడం దురదృష్టకరం' అని ఆమె పేర్కొన్నారు. తమ కుమారుడి మరణం ఆత్మహత్యలా లేదని, అసలు నిజాన్ని తేల్చడానికి ఎఫ్‌బీఐ విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు.

- హైవేపై కిక్కిరిసిన వాహనాలు



*హైదరాబాద్ – విజయవాడ 65వ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాలు కిక్కిరిసిపోయాయి. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఇరువైపులా 16 టోల్‌బూత్‌లు ఉండగా.. విజయవాడ వైపు 11 బూత్‌లను తెరిచారు. గత సంక్రాతికి 77వేల వాహనాల రికార్డు ఉండగా.. ఇప్పుడు 6వేలు అధికంగా వెళ్లడంతో ఆ రికార్డు బ్రేక్ అయ్యింది.*
*– చౌటుప్పల్*

## సంక్రాంతి స్పెషల్ బాదుడు

- ప్రయాణికులను నిలువునా దోచుకుంటున్న ఆర్టీసీ
- జేబీఎస్ నుంచి మెదక్‌కు రూ.240, నిర్మల్‌కు 650

మెదక్, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : సంక్రాంతి పండుగ వేళ ప్రయాణికులపైన స్పెషల్ పేరిట ఆర్థిక భారం మోపుతున్నది రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ). పండుగకోసం స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికులను నిలువునా దోచుకుంటున్నది. స్పెషల్ బస్సుల పేరిట బోర్డులు తగిలించి ముక్కుపిండి అధిక చార్జీలు వసూలు చేస్తున్నది. మహిళలకు ఉచిత ప్రయాణానికి అవసరమైన మేరకు బస్సుల సంఖ్య పెంచకపోవడంతో ప్రయాణికుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధిక చార్జీలు పెట్టి కూడా దూర ప్రాంతాలకు నిలబడి పోవాల్సి వస్తున్నదని పురుష ప్రయాణికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నిర్మల్, మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్‌తో పాటు నిజామాబాద్ జిల్లా బాన్సువాడ, బోధన్, ఎల్లారెడ్డి నుంచి నడిపిస్తున్న కొన్ని బస్సులకు దూర ప్రాంతాల బోర్డులు వేసి స్పెషల్ పేరుతో అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ఉన్నతాధికారుల నుంచే తమకు ఆదేశాలు ఉన్నాయంటూ దబాయిస్తున్నారు. ఆదివారం జేబీఎస్ నుంచి మెదక్ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులో డ్రైవర్‌తో ప్రయాణికులు ఘర్షణకు దిగారు. మెదక్ డిపో నుంచి సంక్రాంతి స్పెషల్‌గా ఎక్స్‌ప్రెస్ బోర్డుతో వచ్చిన టీఎస్ 35 జడ్ 0022 బస్సు ఉదయం 7:30 గంటలకు జేబీఎస్‌కు చేరుకుంది. జేబీఎస్‌లో ఆ బస్సు ఎక్కిన ప్రయాణికులతో డ్రైవర్ టికెట్ ఇచ్చి అధికంగా వసూలు చేశాడు. జేబీఎస్ నుంచి మెదక్‌కు రూ.160 చార్జి కాగా, అదనంగా రూ.80 వసూలు చేసి రూ.240 టికెట్ ఇచ్చాడు. అక్కడే ఉన్న మెదక్ డిపో మేనేజర్‌ను ఇదేమిటని అడుగగా, సంక్రాంతి పండుగ సందర్భంగా స్పెషల్ పేరిట చార్జీలు వసూలు చేస్తున్నామని సమాధానమిచ్చారు. జేబీఎస్ నుంచి నిర్మల్‌కు 650 వసూలు చేశారు.




*ఆదివారం జేబీఎస్ నుంచి మెదక్‌కు ఇద్దరికి ఇచ్చిన టికెట్ ధర*



ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ సర్పంచ్‌లు

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఇచ్చోడ, జనవరి 12: ఇచ్చోడ మండలం ముక్రా(బీ) గ్రామానికి చెందిన మొహితే సంతోష్–పూజ దంపతుల పెద్ద కూతురు మొహితే సివంగి(9) బోన్ న్యూరోతో బాధపడుతుంది. ఆదివారం ముక్రా(బీ) మాజీ సర్పంచ్ మారుతి, జల్ద గ్రామ మాజీ సర్పంచ్ నందకిశోర్ వారికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ చికిత్సల కోసం రూ.40 లక్షలు అవసరం ఉందన్నారు. దవాఖాన సొసైటీ వారు రూ.10 లక్షలు, ఆరోగ్యశ్రీ నుంచి రూ.10 లక్షల చొప్పున రూ.20 లక్షలు అయ్యాయని, మరో రూ.20 లక్షలు అవసరం ఉందన్నారు. దాతలు ఫోన్ పే 6309504386 నంబర్‌కు ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు దత్తురాం, లక్ష్మణ్, బాబు, రవి, సంతోష్ పాల్గొన్నారు.



శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న హిందూ వాహిని కార్యకర్తలు

## హిందూ వాహిని ఆవిర్భావ దినోత్సవం

భైంసా, జనవరి 12 : భైంసాలోని శివాజీ చౌరస్తాలో భైంసా శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి, హిందూ వాహిని ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హిందూ వాహిని పట్టణ అధ్యక్షుడు ఆకుల రంజిత్, చింతపండు మహేశ్, నాయకులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ పోరాటంలో భాగస్వామ్యం కావాలి

ఎదులాపురం, జనవరి 12: ఎస్సీ వర్గీకరణ అనే ధర్మ యుద్ధ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ మాదిగ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లో శాంతినగర్ ఎమ్మార్పీఎస్ సమావేశం ఇండ్ల ఎల్లన్న మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై పాల్గొని నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ప్రతి గ్రామానికి మాదిగ కళాకారుల బృందం రాబోతుందన్నారు. అలాగే ఈ నెల 22న జిల్లా కేంద్రానికి మందకృష్ణ మాదిగ వస్తున్నారన్నారు. ఫిబ్రవరి 7న వేల గొంతులు, లక్షల డప్పుళ్లతో భారీ ప్రదర్శన హైదరాబాద్‌లో ఉంటుందన్నారు. వీటిని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎమ్మార్పీఎస్ శాంతినగర్ కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెద్దింటి సూర్యప్రసాద్, ఉపాధ్యక్షులుగా మల్యాల రవి, ప్రధాన కార్యదర్శిగా పసుల శ్రీనివాస్, కార్యదర్శిగా దాసరి రాజు, సంయుక్త కార్యదర్శిగా రొడ్డ రవి, ప్రచార కార్యదర్శులుగా రొడ్డ రమేశ్, రమేశ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా బట్టు అరుణ్, కార్యవర్గ సభ్యులుగా పెద్దింటి మురళి, నడికుంట కృష్ణ, గణేశ్, అశోక్, అభిలాష్, ముక్తేశ్వర్, విలాస్, రాజలింగు, గౌరవ సలహాదారులుగా పెంటపర్తి ప్రహ్లాద్, ఎనగందుల రాజలింగు, కడదారపు దేవన్న, రాము ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఎంఈఎఫ్ జిల్లా నాయకుడు గుర్రాల ఆశన్న, టౌన్ ఇన్‌చార్జి మనోజ్, జిల్లా నాయకులు సంజీవ్, శ్రీహరి పాల్గొన్నారు.

# పండుగ కారాదు విషాదం

దస్తురాబాద్, జనవరి 12 : సంక్రాంతి అంటే పతంగుల పండుగ. చిన్నారులతో పాటు పెద్దవాళ్లు కూడా పతంగులు ఎగురవేయడంపై ఆసక్తి చూపుతారు. ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు పాఠశాలలకు ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రకటించింది. పతంగులు గాల్లో ఎగురుతుంటే పిల్లల కేరింతలు ఆనందాలకు హద్దులు ఉండవు. ఒకరికి మించి ఒకరికి పోటీ పడుతూ ఎగురవేస్తారు. కానీ వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు మాత్రం పాటించారు. ఇలా చేయడం వలన కొంత మంది ప్రాణాలు పోయిన సందర్భాలు ఉన్నాయి. పెద్ద భవనాల పైకి వెళ్లి పతంగులు ఎగురవేస్తుంటారు. తొందరభావంతో ఆ భవనంపై ఎక్కడ నిల్చున్నాం అనేది పట్టించుకోరు. అంతేకాకుండా విద్యుత్ తీగలు ఉన్నాయి అనేది చూసుకోకుండా పతంగులు ఎగురవేస్తుంటారు. కొంత మంది రోడ్డుపై వాహనాలు, పాదచారులు వస్తున్నా పట్టించుకోకుండా ఎగురవేయడం చాలా ప్రమాదకరం. పతంగులకు ఉపయోగించే దారం రోడ్డుకు అడ్డంగా పడితే వాహన చోదకులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. విశాలమైన మైదాన ప్రాంతంల్లో, జన సంచారం లేని ప్రాంతాలు, క్రీడా మైదానాల్లో పతంగులు ఎగురవేస్తే ప్రమాదాలు జ రిగే ఆస్కారం ఉండదు. తల్లిదండ్రులు తమ పిల్లలు పతంగులు ఎగురవేసే సందర్భంలో వారికి తోడుగా ఉండేలా చూసుకోవాలి



పంతంగుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ శంకర్

**చైనా మాంజాతో ప్రమాదం..**

పతంగుల ఎగురవేతలో కొందరు చైనా మాంజాను వినియోగిస్తున్నారు. ఈ చైనా మాంజా కొని కుటుంబాలలో విషాదాలను నింపుతున్నాయి. దీని ద్వారా పక్షులకు, మనుషులకు హాని కలుగుతుంది. అటవీ శాఖ 2007లో చైనా మాంజా వాడకాన్ని నిషేదించారు. దీంతో వీటి అమ్మకాలు, వాడకాలు నిషేదించింది ప్రభుత్వం. మనుషులకు, మూగజీవాలకు, పక్షుల ప్రాణాలతో పాటు పర్యావరణానికి హాని కలిగించే చైనా మాంజాను వాడవద్దని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.



బహుమతులు అందజేస్తున్న మాజీ ఎంపీపీ గండ్రత్ రమేశ్

## గిరిజన యువత క్రీడల్లో రాణించాలి

ఎదులాపురం, జనవరి 12: గిరిజన యువత క్రీడల్లో రాణించాలని మాజీ ఎంపీపీ గండ్రత్ రమేశ్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ రూరల్ మండలం ఖండాల గ్రామంలో జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులను అందజేశారు. విజేతలుగా నిలిచిన జట్లు తుమ్మగూడ జట్టు మొదటి బహుమతి రూ.18 వేలు, సమక జట్టు రెండవ బహుమతి రూ.12 వేలు, మూడో బహుమతి ఖండాల జట్టు రూ.6 వేలను జోగు ఫౌండేషన్ ద్వారా అందించినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు జగదీశ్ యాదవ్, కుమ్ర రాజు, ప్రకాశ్, సుంగు, మోతీరాం, బుచ్చన్న పాల్గొన్నారు.

## సర్కారు కొలువు సాధించడం అభినందనీయం

కుంటాల, జనవరి 12 : ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన చాట్ల స్రవంతి, కుర్ర విజయలక్ష్మి, సాయికిరణ్, మధుకర్, భరద్వాజ్‌ను ఆదివారం మండల పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పద్మశాలీ సంఘ భవనంలో ఘనంగా సత్కరించారు. సంఘం మండలాధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో గంగాధర్, గోవర్ధన్, సాయిరాం, చాట్ల శ్రావణ్, బోగ రమేశ్, సాగర్, బైండ్ల నవీన్ పాల్గొన్నారు.



ఉద్యోగం సాధించిన వారిని సన్మానిస్తున్న పద్మశాలీలు

## మహిళను కుటుంబీకులకు అప్పగింత

బాసర, జనవరి 12 : నిర్మల్ జిల్లా బాసరలో రైల్వేస్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళను ఆమె కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్ఐ గణేశ్ తెలిపారు. వివరాల ప్రకారం... ఆదివారం ఉదయం బాసర రైల్వే స్టేషన్ వద్ద నిజామాబాద్ నుంచి మేడ్చల్ నాందేడ్ రైలు ఎక్కివచ్చిన ఓ మైనారిటీ మహిళ బాసర రైల్వే స్టేషన్ వద్ద దిగి అక్కడి నుంచి గోదావరి వద్దకు వెళ్తుంటే గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆమెను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి వివరాలు తెలుసుకొని కుటుంబీకులకు అప్పగించినట్లు తెలిపారు. అదే విధంగా సాయంత్రం మహారాష్ట్ర దెగ్లూర్‌కు చెందిన ఓ మహిళను సైతం కాపాడినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, కానిస్టేబుల్ దీప ఉన్నారు.



మహిళలను కుటుంబీకులకు అప్పగిస్తున్న పోలీసులు

## చైనా మాంజా విక్రేయదారులపై కేసు నమోదు

ఎదులాపురం, జనవరి 12 : నిషేధిత చైనా మాంజ విక్రయదారులపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదిలాబాద్‌లోని పలు షాపులను తనిఖీ చేశారు. తనిఖీ చేపట్టిన సమయంలో నిషేధిత చైనా మాంజా ఉన్నట్లు గుర్తించారు. వాటిని విక్రయిస్తున్న బడక మొహల్లాకు చెందిన వాడస్కర్ కృష్ణ, అశోక్ రోడ్డుకు చెందిన కూరగాయాల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎవరైనా నిషేధిత చైనా మాంజా విక్రయించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



విచారణ చేపడుతున్న ఎస్పీ

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

ముథోల్, జనవరి 12 : నిర్మల్ జిల్లా ముథోల్‌లోని కొలిగల్లీకి చెందిన కరణ్(సచిన్)(34) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు సీఐ మల్లేశ్ తెలిపారు. వివరాల ప్రకారం... మృతుడి తండ్రి కుంటాల పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం స్వగ్రామమైన ముథోల్‌కు వచ్చినట్లు తెలిపారు. రాత్రి తండ్రికొడుకుల మధ్య ఆస్తి వివాదంపై గొడవ జరగడంతో కరణ్‌ను కొట్టినట్లు తెలిపారు. దీంతో మృతుడి భార్య సూష్మ తన భర్తను చంపారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్పీ జానకిషర్మిల, భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్, డాగ్‌స్క్వాడ్‌తో విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు. మృతుడి తండ్రి రాందాస్, అనిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. హత్య లేదా అనుమానాస్పద మృతి అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లేశ్ వెల్లడించారు.



కరణ్(ఫైల్)

## ఎమ్మెల్యే చొరవతో గుబిడి రోడ్డు పనులు

తాంసి, జనవరి 12: బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ప్రత్యేక చొరవతో సరిహద్దు గుబిడి రోడ్డు మరమ్మతు (ప్యాచ్‌వర్క్) పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. భీంపూర్ మండల సరిహద్దు గుబిడి నుంచి కరంజి (టీ) వరకు 8 కిలో మీటర్ల రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఆ గ్రామానికి ఆర్టీసీ బస్సులు వేయడం లేదు. ఈ కష్టాలను గుబిడి వాసులు ఎమ్మెల్యేకు విన్నవించగా ఆయన వెంటనే స్పందించారు. తర్వాత బీసీ రోడ్డు పనులు కూడా ప్రారంభమువుతాయని బస్సు సౌకర్యం కోసం ఎమ్మెల్యే డీఎంతో కూడా మాట్లాడారని గుబిడి మాజీ సర్పంచ్ ఎల్పుల ప్రతాప్ యాదవ్, నాయకులు తుడి దత్తు, ఆకం శ్రీనివాస్, రవి, విఠల్ తెలిపారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



గుబిడి రోడ్డు మరమ్మతు పనులు

## విద్యార్థులు లక్ష్యంతో చదువుకోవాలి

భైంసా, జనవరి 12 : విద్యార్థులు లక్ష్యంతో చదువుకోవాలని ఎమ్మెల్యే రామారావుపాటిల్ అన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా భైంసాలోని డాక్టర్ అసోసియేషన్ భవనంలో మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ధర్మాజీ చంద్రే, ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మణ్‌జాడే, రాజారాం, సూర్యదాస్, ఎంఈవో సుభాష్ పాల్గొన్నారు.